## క్లుప్తంగా

### రేపు కార్మికులకు వైద్య పరీక్షలు

పెదకూరపాడు : మండల పరిధిలోని 20 గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపడుతున్న కార్మికులకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ విద్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు ఈసీజీ, రక్త, బీపీ, షుగర్ వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని పేర్కొన్నారు. కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

### మాదలలో పోషణ మాసోత్సవం



మాదల(ముప్పాళ్ళ): మాదల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మహా మాసోత్సవం కార్యక్రమం శనివారం జరిగింది. సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి పాల్గొని గర్భిణులు బరువు చూసి, పెరుగుదలలో వచ్చిన మార్పుల గురించి వారితో చర్చించారు. పోషకాహారం, రక్తహీనత, పరిశుభ్రతల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.శాంతి, టి.సుధారాణి, ఎల్.అన్నపూర్ణ, సీహెచ్ వీరమ్మ, వి.అంజమ్మ, వి.అనురాధ, డి.వీరకుమారి తదితరులు పాల్గొన్నారు.

### లడ్డూ కల్తీపై చర్యలు తీసుకోవాలి



సత్తెనపల్లి: తిరుమల తిరుపతి దేవస్థానములో ప్రసాదాల తయారీలో జరిగిన అవకతవకలు, అందుకు సహకరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని హిందువుల మనోభావాలను, దేవస్థానం పవిత్రతను కాపాడాలని టీడీపీ లీగల్ సెల్ పట్టణ అధ్యక్షుడు, న్యాయవాది మద్దినేని వెంకట చలపతిరావు కోరారు. ఈ మేరకు డీఎస్పీ మేదరమెట్ల హనుమంతురావు, పట్టణ ఎస్ఐ ఎం.సంధ్యారాణినికి శనివారం వేర్వేరుగా లిఖిత పూర్వక ఫిర్యాదు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీకి చెందిన న్యాయవాదులు అనుమోలు జయరాం, పూదోట రాజు, చలువాది చిన సత్యనారాయణ, దివ్వెల శ్రీనివాసరావు, కళ్లం వీరభాస్కరరెడ్డి, రాయసం వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

### ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సత్తెనపల్లి: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. కూటమి పాలన వంద రోజులు పూర్తయిన సందర్భంగా సత్తెనపల్లి మండలం పాకాలపాడు గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పనితీరును వివరించారు. ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేసి స్టిక్కర్లను అతికించారు.ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కొణికినేని సత్య నారాయణ, నాయకులు కోమటినేని శ్రీనివాసరావు, షేక్ నన్నేసా, సరికొండ వెంకటేశ్వరరాజు తదితరులు ఉన్నారు.

### ఈ-పంట నమోదు చేసుకోండి

క్రోసూరు: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను ఈ-పంట యాప్‌లో నమోదు చేయించుకుని, ఈ-కేవైసీ ఈ నెల 23లోపు పూర్తి చేసుకోవాలని ఏడీఏ హనుమంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని పేర్కొన్నారు. యాప్‌లో వివరాలు నమోదయ్యాయా..లేవా అనేది సరిచూసుకోవాలని తెలిపారు.

### నేడు మాల మహానాడు సమావేశం

క్రోసూరు: మండల కేంద్రంలోని షాదీఖానాలో ఆదివారం ఉదయం 12 గంటలకు మాల మహానాడు పెదకూరపాడు నియోజకవర్గ కమిటీ సమావేశం జరుగుతుందని సభ్యుడు పైర్ల మాణికర్యరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోదా జాన్‌పాల్ పాల్గొంటారని పేర్కొన్నారు.

### లాటరీ టిక్కెట్ల విక్రేత అరెస్టు

నాదెండ్ల: యడ్లపాడులో సింగిల్ నెంబర్ లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్న షేక్ బాజీని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నిందితుడు బాజీ ఆన్‌లైన్‌లో బోజో యాప్ ద్వారా లాటరీ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసి సింగిల్ నెంబర్ లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మసీదు సెంటర్‌లో టిక్కెట్లు విక్రయిస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద రూ.3,400లు నగదు, టిక్కెటు నెంబర్లు గల షీటు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

# ఓటర్ల జాబితా సవరణను సద్వినియోగించుకోవాలి

- ఇంటింటికి ఓటర్ల సర్వే పూర్తి
- సత్తెనపల్లి ఆర్డీఓ మురళీకృష్ణ



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మురళీకృష్ణ

సత్తెనపల్లి: కేంద్ర ఎన్నికల సంఘం కల్పించిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని సత్తెనపల్లి ఆర్డీవో వి.మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు స్పెషల్ సమ్మరీ రివిజన్ -2024 నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా గత నెల 20 నుంచి చేపట్టిన బూత్ స్థాయి అధికారుల (బీఎల్వోలు) ఇంటింటి సర్వే శనివారంతో ముగిసిందన్నారు. బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి కొత్త ఓటర్ల నమోదుతో పాటు మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్ల తొలగింపు, తప్పొప్పులు సవరణకు దరఖాస్తులు స్వీకరించారని తెలిపారు. సవరణ చేయడానికి వీలుగా ఫాం-6, 7, 8ను అందజేశారన్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,42,246 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 2,42,123 మంది ఓటర్లు అంటే 99.95 శాతం పరిశీలన పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగిలిన 826 మంది ఓటర్లు ఎన్ఆర్ఐ, అందుబాటులో లేని వారిగా గుర్తించడం జరిగిందన్నారు. 2025 జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు కొత్తగా ఓటు హక్కుకు అర్హులన్నారు. పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులపైన చర్చించారు. ఈ అంశాలన్నీ ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో బీఎల్వోలు నమోదు చేస్తారని చెప్పారు. అక్టోబర్ 29న ముసాయిదా జాబితా విడుదల చేయడం జరుగుతుందని, డిసెంబర్ 24 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. 2025 జనవరి 6న తుది ఓటర్ల జాబితా ప్రచురణ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో సత్తెనపల్లి తహసీల్దార్ కె.శ్రీనివాస చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, నకరికల్లు, ముప్పాళ్ల తహసీల్దార్లు కె. పుల్లారావు, ఎం.భవానిశంకర్, రాజుపాలెం సీనియర్ సహాయకురాలు కవిత, నియోజ కవర్గ డిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికల విభాగం) వెంకటేశ్వర్లు నాయక్, సత్తెనపల్లి తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ బోస్‌బాబు పాల్గొన్నారు.

### క్రీడాకారులకు అభినందన



నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికైన క్రీడాకారులు

అచ్చంపేట: స్థానిక జడ్పీ హైస్కూలులో రెండు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో తమ పాఠశాల విద్యార్థులు 58 మంది నియోజకవర్గ స్థాయి జట్లకు ఎంపికైనట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులం ప్రిన్సిపల్ టి.అరుణకుమార్ శనివారం తెలిపారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్, అథ్లెటిక్స్‌లో విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. ఈ నెల 26 నుంచి జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను, వారికి తర్ఫీదునిచ్చిన పీడీ సత్యనారాయణ నాయక్, పీఈటీ జి.బ్రహ్మయ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డి.ప్రభాకర్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### ఉచిత కంటి వైద్య పరీక్షలు



క్రోసూరు: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ అధికారులకు, సిబ్బందికి శనివారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. శంకర కంటి ఆసుపత్రి టెక్నీషియన్లు వారికి మందులు, ఐ డ్రాప్స్ అందించారు. కళ్లజోళ్లు అవసరమైన వారి పేర్లు నమోదు చేసుకుని, త్వరలో ఇస్తామన్నారు. కంటి ఆపరేషన్లకు గుంటూరులోని శంకర కంటి ఆసుపత్రికి పంపించేందుకు ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా స్కూల్ గేమ్స్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ-2 సీతారామిరెడ్డి

నార్నెపాడు(ముప్పాళ్ళ): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు మండలంలోని నార్నెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఎంఈఓ-2 సీతారామిరెడ్డి ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ అధ్యక్షతన మొత్తం 7 విభాగాల్లో జరిగే పోటీలకు సుమారు 150 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. మొదటి రోజు కబడ్డీ, వాలీబాల్, చెస్ పోటీలు జరగ్గా, ముప్పాళ్ళ, నార్నెపాడు, కేజీబీవీ పాఠశాలలకు చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వర్షం పడటంతో మిగిలిన పోటీలు నిలిచిపోయాయి. పోటీలకు మండల కో-ఆర్డినేటర్‌గా జి.నరసింహారావు, పీడీలు ఎస్.ఎం.సుభాని, సత్యవతి, పీఈటీ రాణి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

### ఉన్నం నాగేశ్వరరావుకు అంతిమ వీడ్కోలు

సత్తెనపల్లి: ప్రజా కళా మండలి రాష్ట్ర కోశాధికారి ఉన్నం నాగేశ్వరరావు అకాల మృతి తీరని లోటును మిగిల్చిందని విప్లవ రచయితల సంఘం నాయకులు ఖాసిం అన్నారు. పట్టణంలోని వడ్డవల్లి నుంచి నాగేశ్వరరావు అంతిమయాత్ర శనివారం ఊరేగింపుగా ప్రజా కళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు ప్రజా కళా మండలికి అందించిన సేవలను కొనియాడారు. ముందుగా ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో విప్లవ రచయితల సంఘం నాయకులు సీఆర్ ప్రసాద్, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు కృష్ణ, ప్రజాతంత్ర ఉద్యమ కమిటీ నాయకులు వెంకటేశ్వరరావు, రామారావు, ఏడుకొండలు, ఏపీ పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు చిలుకా చంద్రశేఖర్, జిల్లా నాయకుడు ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు డీజే పాల్, మాధంశెట్టి వేదాద్రి, ఏఐటీయూసీ నాయకులు కంబాల శ్రీనివాస్, రామారావు, రామకృష్ణ, 16వ వార్డు కౌన్సిలర్ అబ్రహం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# లింగ సమానత్వం కోసం పాటుపడాలి

**డీబీఆర్సీ రాష్ట్ర మహిళా ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ హేమలత**



మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ హేమలత

సత్తెనపల్లి: లింగ భేదం లేని సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్సీ) రాష్ట్ర మహిళా ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ ఎం.హేమలత అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో స్త్రీ, పురుష సమానత్వం పై సత్తెనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సు లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. సదస్సుకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షత వహించారు. హేమలత మాట్లాడుతూ సమాజంలో ఆడ, మగ పిల్లలను సమానంగా చూడటంలో తల్లిదండ్రులు పాత్ర ఎంతో ముఖ్యమైన దన్నారు. ఓఎల్సి కో-ఆర్డినేటర్ డి.అమల మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి కొన్ని దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ స్త్రీల పట్ల అవమానాలు, అత్యాచారాలు, హత్యలు, దోపిడీలు జరుగుతున్నాయన్నారు. వీటిని ఆపటానికి ప్రభుత్వం రక్షణ చట్టాలు మహిళలు పూర్తిగా అవగాహన చేసుకోవాలన్నారు. ఏసీడీపీఓ సంతోష్ కుమారి మాట్లాడుతూ వివక్ష లేని సమాజం నిర్మించడానికి కుల,మత బేధాలను పక్కనపెట్టి మనిషిని మనిషిగా గౌరవించే సంస్కృతి అలవాటు చేసుకోవాలన్నారు. సదస్సులో మండలం వెలుగు అసిస్టెంట్ ప్రోగ్రాం మేనేజర్ శిఖా కృపా వేణి, మెప్మా టీఎంసీ ఎస్‌వీఎన్ నాగేశ్వరి, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కో-ఆర్డినేటర్స్ మేడే వెంకటరమణ, గడ్డిపతి కోటిరత్నం, తోకల సాంబయ్య పాల్గొన్నారు.

### వినుకొండలో హెచ్ఐవీపై అవగాహన



వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ స్వచ్ఛంద సంస్థ ఆదేశాల మేరకు వినుకొండ వైద్య ఆరోగ్య శాఖ, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మీకు తెలుసా హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నూజెండ్ల మండలంలోని సచివాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నాగశ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ చేస్తున్న కార్యక్రమాలను వారు అభినందించారు. హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్షత చూపకూడదన్నారు. ప్రభుత్వం బాధితుల కోసం చేస్తున్న సేవలను గురించి వివరించారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమంలో పాల్గొని సంస్థ సభ్యులు హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశ, ఏడుకొండలు, రహంతా, రిబ్కా, విజయ, గంగిరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతోనే ఉన్నత అవకాశాలు

- విద్యార్థులకు డీఎస్పీ నాగేశ్వరరావు సూచన
- ఘనంగా ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల సెలబ్రేషన్స్



క్రీడా విజేతలతో ముఖ్య అతిథులు, కళాశాల పాలకవర్గ ప్రతినిధులు

నరసరావుపేట: విద్యార్థులు క్రమశిక్షణతోనే ఉన్నతావకాశాలు సాధించుకోగలుగుతారని డీఎస్పీ కె.నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం కేసానుపల్లిలోని ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే సెలబ్రేషన్స్‌కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేటి విద్యార్థుల ఆలోచనలు లక్ష్యం వైపు కాకుండా మత్తువంటి చెడువ్యసనాల వైపు వెళ్లటం బాధాకరమన్నారు. క్షణికావేశాలు, క్షణిక ఆలోచలకులోనై చెడు నిర్ణయాలు తీసుకొని చిన్నపాటి నేరాలకు పాల్పడి తల్లిదండ్రులకు బాధ కలిగిస్తున్నారని, కావున లక్ష్యసాధనకు కృషి చేసుకుంటూ తల్లిదండ్రులు, తోటి విద్యార్థులను ఇబ్బంది పెట్టవద్దని కోరారు. గౌరవ అతిథిగా హాజరైన సీఐ పి.రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుపై ఏకాగ్రత, మంచి అలవాట్లు పెంపొందించుకుని తమ వ్యక్తిగత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కోరారు. కళాశాల చైర్మన్ షేక్ మీరావలి మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా ఈ ఆధునిక సాంకేతిక పోటీ ప్రపంచానికి తగినట్లుగా నైపుణ్యాన్ని వృద్ధి చేసుకోవాలని సూచించారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంటు షేక్ కరీం మోహిద్దీన్ మాట్లాడుతూ విద్యార్థుల శ్రేయస్సు కోసం అన్నిరకాల మౌలిక సదుపాయాలు రాజీలేకుండా సమకూర్చామని, విద్యార్థులు ఈ సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ విద్యార్థులకు సంపూర్ణ విద్య అందించటంతో పాటుగా తగిన ఉద్యోగాలు క్యాంపస్ సెలక్షన్స్ ద్వారా తెచ్చిపెట్టేందుకు కావలసిన ప్రత్యేక శిక్షణపై శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, కళాశాల ప్రిన్సిపాల్ జి.నాగమల్లేశ్వరరావు మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఆటల పోటీలలో విజేతలైన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందచేశారు.

### రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

వినుకొండ(నూజెండ్ల): ఈ-పంటలో నమోదు చేసుకున్న రైతులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి సుగుణాబేగం తెలిపారు. నూజెండ్లలోని రైతు సేవా కేంద్రంలో జరుగుతున్న ఈకేవైసీ, ఈ పంట నమోదును ఆమె పర్యవేక్షించారు. ఈ-పంట నమోదులో రాష్ట్ర ప్రభుత్వం సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. పంట రుణాలు, సున్నా వడ్డీ, పెట్టుబడి రాయితీ, పంటల బీమా, పంట నష్టపరిహారం వంటి ఏ లబ్ధి పొందాలన్నా ఈ-పంట నమోదుతో పాటు ఈకేవైసీ వివరాలు ప్రామాణికమని తెలిపారు. ఈ నెల 23వ తేదీలో ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు.

### నూరుశాతం ఫలితాలు సాధించాలి



నకరికల్లు: విద్యార్థుల హాజరు శాతం పెంచడంతో పాటు నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాలని డెప్యూటీ డీఈఓ కె.వేణుగోపాలరావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని దేచవరం ఆదర్శ పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో వేర్వేరుగా మాట్లాడారు. రికార్డులు పరిశీలించారు. 9వ తరగతి, ఇంటర్ విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. గణితంలో విద్యార్థులను ప్రతిభను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన బోధన పద్ధతులు, పాఠశాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కె.వేళాంగిణి మేరీ, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు చిత్ర లేఖనం, వ్యాసరచన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పెదకూరపాడు: స్వచ్ఛతా హీ సేవపై విద్యార్థులకు చిత్ర లేఖనం, వ్యాస రచన పోటీలను నిర్వహించినట్లు జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి విజయ్ బెన్ని బాబు శనివారం తెలిపారు. పెదకూరపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో గుంటూరు ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సౌజన్యంతో జనచైతన్య సమితి ఆధ్వర్యంలో ఎనిమిది నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు స్వచ్ఛతా హీ సేవ, స్వభావ స్వచ్ఛత సంస్కార స్వచ్ఛతపై వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనం సీనియర్ విభాగంలో షేక్ ఆసిఫా, జి.లక్ష్మీ భార్గవి, రాహీల, ఎం.విజయలక్ష్మి, జూనియర్ విభాగంలో పి.ఉమాదేవి, షేక్ అఫ్రిన్, షేక్ నౌషిన్, వ్యాస రచన పోటీల్లో షేక్ రిహాన, షేక్ అఫ్రిజ, షేక్ ఆసిఫాతబ్సన్, బి.మరియరాణి విజేతలుగా నిలిచినట్లు హెచ్ ఎం.వెంకటరమణ తెలిపారు. వీరికి ప్రశంసా పత్రాలతో పాటు ప్రోత్సాహక బహుమతులను అందించనున్నట్లు సమితి నిర్వాహకులు చెప్పారు.

# 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాల పంపిణీ



పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

పెదకూరపాడు : వంద రోజుల కూటమి ప్రభుత్వంలో అనేక విజయాలు సాధించామని దానిని 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని టీడీపీ జిల్లా కార్యదర్శి అర్తిమల్ల రమేష్ అన్నారు. శనివారం క్లస్టర్ ఇన్‌చార్జ్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరి పెదకూరపాడు గ్రామంలో కరపత్రాలను సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొకటిగా అమలు పరుస్తున్నట్లు వెల్లడించారు. దీపావళి కానుకగా మహిళలకు ఉచిత సిలిండర్లు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు బూత్ కన్వీనర్ మోహిద్దీన్ బచ్చ, మీరావలి, జంగాల ప్రసాద్, కమలేష్, తాళ్లూరి రమేష్, కూరపాటి కోటయ్య తదితరులు ఉన్నారు.

**మొక్కపాడులో 'ఇది మంచి ప్రభుత్వం'**

రాజుపాలెం: ప్రజలకు సంక్షేమ పాలన అందించడం ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని మొక్కపాడు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన వంద రోజుల పాలనలో చేపట్టిన కార్యక్రమాలు ఇంటింటికి వెళ్లి వివరిస్తున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులకు నగదు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కష్టపడి చదవండి

**ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: తల్లిదండ్రులను దృష్టిలో పెట్టుకుని బాలికలు అందరూ కష్టపడి చదువుకొని మంచి ఉన్నత స్థాయిలో ఉండాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని తాలూకా సెంటర్ వద్ద గల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎంతో మంది మహానుభావులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకొని ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ ఛైర్మన్ పద్మ మాట్లాడుతూ వర్షం కురిస్తే నీళ్ల నిలబడుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని కోరారు. పాఠశాలలో ఉన్నటువంటి సమస్యలన్నీ త్వరితగతిన పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు ఎ.శ్రీనివాసరావు, ఎ.రాఘవేంద్రరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె.మాధవీలత, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఆతుకూరి నాగేశ్వరరావు, నాయకులు సర్వేపల్లి సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

# వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

**డిప్యూటీ డీఈఓ వేణుగోపాలరావు**



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న వేణుగోపాలరావు

నరసరావుపేట ఈస్ట్: చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డిప్యూటీ డీఈఓ కె.వేణుగోపాలరావు తెలిపారు. బరంపేటలోని శ్రీరామకృష్ణ ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల పఠనా నైపుణ్యాలను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల నోట్స్‌బుక్స్‌తో పాటు ఉపాధ్యాయుల టీచింగ్ నోట్స్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. తరచూ గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు వచ్చేలా కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను పెంచుకోవటంతో పాటు విద్యార్థులలో అభ్యాసన నైపుణ్యాలను పెంచాలని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనం అమలును పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం అందివ్వాలని ఆదేశించారు. అలాగే మధ్యాహ్న భోజనం ఆయా రోజుల్లో పర్యవేక్షించే ఉపాధ్యాయులు పొరపాట్లు జరగకుండా చూసుకోవాలనీ, ఎటువంటి పొరపాటు జరిగినా అందుకు బాధ్యత సదరు ఉపాధ్యాయుడుదేనని స్పష్టం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సత్యనారాయణసింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కుక్క కాటుతో విలువైన పంది మృతి



ఖననానికి తరలిస్తున్న పంది కళేబరం

నాదెండ్ల: కుక్కల బెడద గ్రామాల్లో తీవ్రమౌతోంది. కుక్కకాటుకు గురై రూ.50 వేలు విలువ జేసే పంది మృతి చెందిన సంఘటన గణపవరం గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు మన్నెం రాఘవ తెలిపిన వివరాల మేరకు గణపవరం సినిమా హాల్ రోడ్డులో నివాసం ఉండే రాఘవ జీవాలు మేపుకుంటూ జీవిస్తుంటాడు. తమ కుల దైవం అంకమ్మస్వామి దేవర పేరిట పందిని బహూకరించాడు. ఏడాది కాలంగా పందిని మేపుతున్నాడు. సదరు వరాహం ఈనెల 18న కుక్కకాటుకు గురైంది. దీంతో అనారోగ్యానికి గురైన పంది శుక్రవారం వర్షం కురవటంతో తడిచి ఉదయానికి మృతి చెందింది. శనివారం రాఘవ కుటుంబ సభ్యులు పూజలు చేసి తమ పొలంలో ఖననం చేశారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఇప్పటికే లేగదూడలు, గొర్రెలపై దాడి చేయటంతో పదుల సంఖ్యలో మృతి చెందాయి. చిన్నారులు, పెద్దలను సైతం కరిచిన సందర్భాలు అనేకం ఉన్నాయి. పాఠశాలలకు వెళ్ళే చిన్నారులు కుక్కల మందలను చూసి బెంబేలెత్తుతున్నారు. పంచాయతీ అధికారులు కుక్కల బెడద నివారించాలని ప్రజలు కోరుతున్నారు.